# నక్సలైట్ రాత్రులు

'ఆ చింతచెట్టు కింద లెఫ్టుకి తీసాపు' అన్నాడు క్లీనర్ నర్సిములు, పద్దెనిమిదేళ్ల వాడి గొంతు లారీ ఇంజన్ మోతలో వెల్డింగ్ ధ్వనిలాగ మోగింది.

బ్రేక్‌మీద పాదాన్నినొక్కి 'ఏడీ ఎక్కడ ఒక్క లంజకొడుకూ ఇక్కడ కనబడ్డు' అక్కడ ఎవరూ కనిపించక పోయేసరికి విసుక్కున్నాడు లారీ డ్రైవర్ సిమ్మాద్రి. లారీ లైట్‌లో కనిపించినంత మేరా అక్కడ ఉండవలసిన మనుషులకోసం వెతికాడు సిమ్మాద్రి.

కొబ్బరికాయలు లోడ్ ఎక్కించుకుపోవటానికి వచ్చింది లారీ. సిమ్మాద్రికి ఈ రూట్ కొత్త. నర్సిములు ఆపమన్న దగ్గర కొబ్బరికాయలరాశి కనిపించలేదు. లోడ్‌చేసే లేబరూ లేరు. దారితప్పి ఈ ఊరు చేరామేమో అనిపించింది సిమ్మాద్రికి.

'హార్న్ కొట్టు' అని నర్సిములు చెప్పటమూ, చెవులు గింగుర్లెత్తిపోయేట్టు సిమ్మాద్రి హార్న్ కొట్టటమూ ఒకేమారు జరిగాయి. చీకటి. ఊరు ఎక్కడుందో ఏమిటో. మనుషుల అలికిడిలేదు. దానికితోడు అప్పుడే నక్కలు ఒకటి తర్వాత ఒకటి ఊళలు అందుకున్నాయి. అడవుల్లో కొండల్లో ఏజెన్సీ ఏరియా అంతటా అటు సాలూరు లైన్‌లో ఏళ్ల తరబడి తిరిగినా భయం లేకపోయింది. కాని ఈ నక్కల ఊళలకి గుండె కొట్టుకుంది సిమ్మాద్రికి. మనిషి చచ్చి పోయినప్పుడు చుట్టూ ఉన్న బంధువులు గొల్లున ఏడిచినట్టనిపించింది.

'ఇక్కడ ఈ ఊళ్లోనేనా లోడింగు?'

క్లీనర్ నర్సిములు ఈ రూట్‌న గత రెండేళ్ల నించి తిరుగుతున్నాడు. మానేజర్ చెప్పినంత మట్టుకు ఇదే ఊరని గుర్తు.

'ఇంజినాపు' అని నర్సిములు కిందికి దూకాడు.

శ్రీకాకుళం నించి వచ్చి సోంపేటలో ఎరువుల బస్తాలు దించి మరో అర్ధగంట సేపు పరుగెత్తి చివరికి ఈ చింతచెట్టు కింద ఆగింది లారీ. ఇక్కడ కొబ్బరికాయల లోడింగ్ అయిపోయినాకా మరోగంటలో మళ్లీ సుమారు మూడు గంటలు తిరుగు ప్రయాణం. ఇదేరాత్రి.

డ్రైవర్ సిమ్మాద్రి బీడీ తీసి అగ్గిపుల్ల గీసి వెలిగించాడు. నోటినిండా పొగపీల్చి మింగాడు. నెలదినాలుగా పెరిగిన గెడ్డాన్ని గోక్కున్నాడు. ముఖంమీది చెమట్ని తుడుచుకుని నుదురుమీద పడుతున్న జుత్తుని వేళ్లతో వెనక్కి దువ్వుకున్నాడు.

'చంద్రన్నా చంద్రన్నా'

లారీ హార్న్‌కంటే తన గొంతే నయమన్నట్టు అరచి పిలిచాడు నర్సిములు.

సీట్‌నించి కిందికి దిగకుండా వెతికి చుట్టూ చూస్తున్నాడు డ్రైవర్ సిమ్మాద్రి.

అంతకుముందే పడిన వానకి చెట్లఆకుల వాసన రేగింది. దానికి రాత్రిపూల వాసనలు తోడయ్యాయి. వాటితో గాలి చిక్కబడి మత్తెక్కిస్తున్నది. కీచురాళ్లు వర్షంలో తడిసినందుకు సంతోషిస్తున్నట్టు అరుస్తున్నాయి. ఆకాశాన్నీ చుక్కల్నీ కప్పేస్తున్నాయి కొబ్బరితోటలు.

'ఇది ఊరా, అడివా?' మళ్లీ విసుక్కున్నాడు సిమ్మాద్రి.

ఆ బండిలో సిమ్మాద్రితో రావటం నర్సిములుకి ఇష్టం లేదు. పోలీస్ ఆఫీసర్ ఎవరో ప్రొప్రయిటర్ స్నేహితుడు, బదిలీ అయిన సందర్భంలో నర్సిములు లారీ ఆ లగేజ్‌తో అటు రాజమండ్రి వెళ్లింది. సిమ్మాద్రికి ఈ రూట్ కొత్త అని నర్సిములుని ఈ బండికి పంపించాడు మేనేజరు. సిమ్మాద్రి అంటే స్టాఫ్‌లో చాలా మందికి పడదు. అందరి దగ్గరా అప్పులు చేస్తాడు. తీర్చడు. మందితో కలవడు. ఏ చందాలూ ఇవ్వడు. ఎప్పుడూ నవ్వడు. షెడ్‌లోకి వస్తే మెకానిక్‌తో పోట్లాట. ఆఫీసులో గుమస్తాని తన్నబోతాడు. ఆర్నెల్ల కిందట వేరే కంపెనీ డ్రయివర్‌ని చితకతన్నాడు. వీటన్నిటి వలన సిమ్మాద్రి అంటే నర్సిములుకి ఓ పక్క భయంకూడా.

'ఎల్లు, ఊళ్లోకెల్లి ఏమయిందో చూడు' అన్నాడు సిమ్మాద్రి.

నర్సిములు ఊరువేపు నడిచాడు.

తొందర పడుతున్నాడు సిమ్మాద్రి. లారీ లోడింగ్ ఎంత తొందరగా అయిపోతే అంత తొందరగా పోవచ్చు. మూడుగంటల్లో బండిని గోడౌన్స్ దగ్గర వొదిలేయొచ్చు. ఇంట్లో చావుగడియల్లో ఉంది భార్య నీలమ్మ. ఎవ్వరూ తోడులేరు. ఇరుగూపొరుగూ ఉన్నా లేనట్టే. పొరుగమ్మను బతిమాలి అర్ధరాత్రికల్లా వచ్చేస్తానని చెప్పి కాపలా ఉంచి వచ్చాడు.

నీలమ్మ మతిపడ్డప్పుడల్లా గుండె రంపపుకోత పెట్టుంది సిమ్మాద్రికి. చేజేతులా చంపేస్తున్నాడు. నీలమ్మ చచ్చిపోతుంది. ఇంక బతకదు. తను వెళ్లేసరికే —ప్రాణం విడిచి ఉంటుంది. రెండు వారాల క్రితమే డాక్టరు ఒకటి రెండురోజుల మనిషి, లాభంలేదు అన్నాడు. ఏ రోజు కారోజే చచ్చిపోతుందను కుంటున్నాడు. ఇంక బతకదు. ఇంటికి తొందరగా వెళ్లాలి తను. ఇప్పుడంటే ఇప్పుడు అక్కడుండాలి. అనుకోకుండా ఇంజిన్ స్టార్ట్ చేశాడు. తెలివి తెచ్చుకుని ఆపాడు. మళ్లీ హార్న్ కొట్టాడు. నర్సిములు ఊరు చేరాడో లేదో. ఆ ఊరు ఎక్కడుందో. ఎవరూ కనబడరు. ఈ రాత్రి లోడింగ్ ఉండదా కొంపతీసి. భయంగా ఉంది ఆ ఊహ. ఇలాంటి పాడు ఊహలు వస్తాయి కొన్నిసార్లు. అవి నిజమూ అవుతాయి. లోడింగ్ కాదా ఇప్పుడు. టయిం ఇంకా ఎనిమిదికాలేదు. అంతా రడీగా ఉంటే అరగంట పని. పన్నెండుకల్లా ఇల్లు చేరిపోయేవాడు. గొంతు తడి ఆరిపోతున్నదన్నా నీళ్లు అందించేవాళ్లు లేరు ఇంట్లో. తనేదిక్కు. డ్యూటీకి రాకపోతే మేనేజర్ తిట్టాడు. బత్తా దొరకదు. బీడీ ముక్కకీ టీ నీళ్లకీ దిక్కు ఉండదు.

లారీ లైట్ తీసేసాడు సిమ్మాద్రి. సీటుదగ్గరి లైట్ కూడా. శ్మశానంలో ఉన్నట్టుంది. అన్నీ రాకూడని ఊహలు. నీలమ్మ పాడిని ఎవరో వెనక మోస్తున్నట్టు కొత్త కుండలో నిప్పులు పట్టుకుని తను ముందు నడుస్తున్నట్టు. చితి కాలుతున్నట్టు. నెత్తురు మరిగి చర్మం పేలుతున్నట్టు. దాని పెద్ద జుత్తు కాలిపోతున్నట్టు.

ఆ ఊహల్తో మోటారు టైరులాంటి సిమ్మాద్రి కూర్చున్నదగ్గరే నీరు నీరయి పోయాడు. వాడి కళ్లల్లో కన్నీళ్లు తిరిగాయి. ముక్కు తడయింది. గొంతులోకి దుఃఖం ముంచుకొచ్చింది. దేముడా దేముడా అన్నాడు. స్వామీ నీవు తప్ప దిక్కెవ్వరూ లేరు అని పదేపదే అనుకున్నాడు. పెళ్లాన్ని కాపాడమని దేవుణ్ని మొక్కుకున్నాడు.

ఎవర్నో ఒక మనిషిని తీసుకుని నర్సిములు వస్తున్నాడు. బయటికి తలపెట్టి 'లోడ్ లేదా?' అన్నాడు. లేకుండా ఉంటే ఇప్పుడే బండి తిప్పేస్తాడు. లోడ్ లేకుండా పోవాలి. దేవుడు వరమిచ్చినంత. చాలా బాగుండును. 'లోడ్ వూళ్లోపల ఉంది.

నక్సలైట్లట' అన్నాడు నర్సిములు.

'కమూనిష్టోళ్ల బయం. రోడ్డ మీద వొద్దన్నాడు పెశిరెంటు' అని నర్సిములుతో వచ్చినవాడు కొత్త డ్రయివర్‌ని చూసి 'ఇయ్యాళ దరమన్న రాలేదా?' అని అడిగాడు నర్సిముల్ని.

సిమ్మాద్రికి చిరాకయింది. లారీ వచ్చి లోడ్ చేసుకుని పోయేదానికి కమ్యూనిష్టులు ఏం చేస్తారు. దీనికోసం బండిని ఊళ్లోకి తీసుకెళ్లాలి. ఆ చిరాకుతోనే 'కమ్యూనిష్టోళ్లు కొబ్బరి తోటలెత్తుకు పోరూ?' అన్నాడు.

'ఏమో ఎవుడికి తెల్సు? ఆళు అన్నీ తీసుకుంతారంతన్నారు'

ఫకాలున నవ్వాడు నర్సిములు.

'అదికాదు నర్సింగులూ, ఆళ్లు ఈ బాగ్గెమంతుల డబ్బూ దనమూ బంగారమూ ఒకటేమిటి అంతా తీసుకుంతన్నారు. మొన్నేమయింది ఎరికా? ఆ బొరెంకలో ఆ ఇంటిలోన ఒక్క బియ్యం గింజ మిగల్చలేదంతే నమ్ముతావా?' అన్నాడు మళ్లీ అమాయికంగా.

నర్సిములు బండెక్కి 'సరిసరి, మాటలు తర్వాత, రా.' అని వాడిని కూడా ఎక్కించుకుని 'ఊళ్లోకి పద' అన్నాడు డ్రయివర్‌తో.

బీడీముక్క పారేసి ఇంజన్ స్టార్ట్ చేశాడు సిమ్మాద్రి.

ఊళ్లోకి వెళ్లే రోడ్డు బాగలేదు. అంతా ఇసిక. పైగా పెద్ద దౌను. తర్వాత పెద్ద అప్పు. సన్నటి రోడ్డు. ఊరు దగ్గరవుతున్నకొద్దీ కంపు.

రైట్‌కి కొయ్యి, లెఫ్టుకి కొయ్యి అని చెప్తూ తిన్నగా దేవాలయం మండపం దగ్గర ఆపించాడు నర్సిములు. దగ్గర్లోనే కిందటి గాలివానకి సగం వొరిగిన స్కూలు బిల్డింగ్. ఆ వరండాలో పోలీసులు. వాళ్ల దగ్గర తుపాకులు. కొందరు యూనిఫారమ్‌లో. ఇంకొందరు సివిల్ డ్రెస్‌లో. వాళ్లు వంట చేసుకుంటు న్నట్టుంది. ఆ స్కూలు దగ్గర్లోనే తూర్పు పక్క ఒలిచిన కొబ్బరికాయల రాశి. వానకి తడవకుండా కమ్మలు కప్పారు.

'చంద్రన్నా, లోడింగ్ అరగంటలో అయిపోవాలి తెల్సిందా. తినకుండా వచ్చినాము, లేటయిపోతాదని. తొందరగా వెళ్తే సోంపేటలో —' అన్నాడు నర్సిములు బండి దిగుతూనే.

కూలీలని తీసుకురావటానికి చంద్రన్న వెళ్లాడు.

మండపం దగ్గర పది పదిహేనుగురు జనం పోగయ్యారు. అక్కడ ఇనప తీగెకి పెట్రో మాక్స్‌లైట్ వేలాడుతున్నది. తిళ్లు అయిన తర్వాత సభ ఉందట. నక్సలైట్లు వస్తే

వాళ్ల మీదికి ఎదురు తిరగటం ఎట్లాగో పెద్ద మనుషులూ, పోలీసులూ చెపుతారట.

సిమ్మాద్రి లారీ సీటునించి కిందికి దిగలేదు. మరొక బీడీ వెలిగించాడు. అటు పార్వతీపురం, పాలకొండ, పాతపట్నం... ఆ ఏజెన్సీవేపు మాత్రమే పోలీసులున్నారు అనుకున్నాడు గాని ఈ మారుమూల ఊళ్లల్లో సైతం ఉంటారనుకోలేదు. అక్కడికి దగ్గర్లోలో ఎక్కడా కొండల్లేవు. అడవులూ లేవు. మరేమో కమ్యూనిష్టులు కొబ్బరికాయలెత్తుకుపోతారని వాటిని ఊళ్లోపల వెయ్యించారు.

అమ్మా అక్కాచేసి బూతులు తిట్టున్నాడు డ్రైవర్ సిమ్మాద్రి. తనని ఈ రూట్‌కు పంపినందుకు మేనేజర్ని తిట్టాడు. ఎరువులు అన్‌లోడ్ చేస్తుంటే వర్షం పట్టుకుంది. అందుకు వర్షాన్ని తిట్టాడు. ఇక్కడికి వచ్చేసరికి రోడ్డు మీద కాకుండా కాయ ఊళ్లో వేయించాడు ప్రశిడెంటు. అందుకు ప్రశిడెంట్‌ని తిట్టాడు. మీటింగ్ జరుగుతున్నదని చప్పుడు చేయొద్దని లోడ్ చేస్తున్న కూలీలని తిట్టి పని ఆపించాడు ఓ పెద్ద మనిషి. ఆ పెద్దమనిషిని తిట్టాడు. ఆ మీటింగుని రెండుగంటలు సాగదీసారు గ్రామ పెద్దలు. వాళ్లని తిట్టున్నాడు. నేలమీద కొబ్బరి కమ్మమీద కూర్చుని ఆ తిట్లన్నీ వింటున్నాడు నర్సిములు. ఎవళ్లెవళ్లనో తిట్టున్నా ఆ తిట్లన్నీ తనకీ తగుల్తున్నట్టున్నాయి నర్సిములుకి.

'నా పెళ్లం చచ్చిపడుంటుందిరా అక్కడ. దాని శవాన్ని ఏ కుక్కో ఈడ్చుకు పోకుండా కాపలా కాయడానికన్నా ఈ రాత్రికి అక్కడికెళ్లాలి. నర్సిములూ లోడింగ్ చేయించు. చంద్రన్నా - ఇప్పుడన్నా లోడింగ్ చేయించు. వెళ్లాలి బేగి —' అని సగం ఏడుపు గొంతుతోనూ సగం ఉక్రోషంతోనూ బతిమాలుతూ చెప్పాడు సిమ్మాద్రి.

'ఏం సెయ్యను డయివేరుబాబూ, పెద్దమనుషులంతా నీ ఎదటే తిట్నారు సూసినావు కదా. మాకు పనిసెయ్యాలని లేదా, కూలిపైసలు మాకు సేదా?'

ఊరు బైట ఆ రోడ్డుమీదే కొబ్బరికాయలు వెయ్యించిఉంటే ఇంత ఇబ్బంది కాకపోయేది.

ఆ ఊళ్లో పెద్దరైతులకు నక్సలైట్లు నోటీసు లిచ్చారట. ఎప్పుడు ఏరాత్రి వచ్చిపడతారో తెలీదు. పోలీసులు వచ్చి కాపలా ఉన్నా గ్రామస్థులు సాయపడితేనేగాని వాళ్లు ఏం చేయలేరు. ఊళ్లో నాలుగయిదు కుటుంబాలు తప్పించి మిగిలినవాళ్లు పట్టించుకోవటం లేదు సరి కదా ఆ నక్సలైట్లతో కలిసిపోతున్నారు. వాళ్లకి గుట్టూ మట్టూ అందిస్తున్నారు. ఊళ్లో వాళ్లని కట్టుదిట్టం చేయకపోతే పరిస్థితులు చేజారిపోయేట్టు ఉన్నాయి. అందుకోసం సభ చేశారు. పదహారేళ్లు దాటిన మగాళ్లంతా రాత్రంతా ఊరుచుట్టూ కాపలా కాయాలని చెప్పారు. ఏ మాత్రం అలికిడి తెలిసినా

ఊరు జనమంతా కత్తులు, కర్రలు, గొడ్డళ్లు, బల్లేలతో ప్రెశిడెంట్ ఇంటి దగ్గరికి రావాలి. ఎదురు తిరగాలి. వచ్చిన వాళ్లని చంపాలి. వాళ్ల సమాచారం తెలిస్తే పోలీసులకి వెంటనే చెప్పాలి. దొరికితే పట్టుకుని పోలీసులకి అప్పజెప్పాలి. ఊళ్లోవాళ్లు ఎవరు రాకపోయినా వాళ్లకి తప్పువేస్తారు. కమ్యూనిష్టోళ్లతో కలుస్తున్నట్టు తెలిస్తే వాళ్ల ప్రాణాలు దక్కవు. రాత్రి చీకటి పడిందగ్గర్నించి ఊరి కాపలా ఉండాలి. అదీ పెద్దమనుషులు చెప్పిన తీర్పు.

చెప్పినదంతా వినికూడా చంద్రన్న వెళ్లి ప్రెశిడెంట్‌ని అడిగాడు. 'రేప్పెందిల. ఇప్పుడు లోడింగ్ చెయ్యొద్దు. వీలుకాదు' అని పంపాడు ప్రెశిడెంట్. మళ్లీ వెళ్లి ప్రెశిడెంట్‌ని అడగటానికి గుండెల్లేవు చంద్రన్నకి.

పోలీసులు తుపాకులతో గంటకీ అరగంటకీ వీధుల్లో గస్తీ తిరుగుతున్నారు టార్చిలైట్లు పట్టుకుని. ఊరంతా చీకటిగా ఉంది.

'మేష్టరుతో సెప్తే ఏమేనా సాయంసేయగల్డు' అన్నాడు చంద్రన్న — తళుక్కున ఆలోచన వచ్చి. చంద్రన్నతో మేష్టరు దగ్గరికెళ్లాడు నర్సిములు. పరిస్థితి అంతా విప్పి చెప్తే విని 'ఇంటి దగ్గర ఇప్పుడు ప్రెశిడెంట్ ఉండడు కదా?' అని ఒకసారి చేతివాచీ చూసుకున్నాడు. 'లాభం లేదు. అయినా వెళ్లి మాటాడండి. తొందరగా వెళ్తే దొరకొచ్చు. ఆ డ్రయివరే వెళ్లి బతిమాల్తే వొప్పుకోవచ్చు' అన్నాడు.

స్కూలు మేష్టరు వాలుకుర్చీమీంచి లేవలేదు సరికదా వెళ్లినవాళ్లని కూర్చోమనలేదు. ప్రెశిడెంట్ బంటే ఇంత నిర్లక్ష్యం చూపించాడు. ఇక ప్రెశిడెంట్ తమని చూడనన్నా చూస్తాడా. ఏమయినా బులెట్ లాంటి సలహా ఇచ్చినందుకు ధైర్యంతో వచ్చి సిమ్మాద్రికి చెప్పాడు.

అప్పటికే రాత్రి పదిగంటలు దాటింది. ఊళ్లోని తాటికమ్మల మట్టిగోడల ఇరుకుద్వారాల ఇళ్లన్నీ నిద్రపోతున్నాయి. ఉన్న ఏడెనిమిది పెంకుటిళ్లు కూడా నిద్రపోతున్నాయి. గ్రామం నడిబొడ్డున ఉన్న రెండుమేడలు తలుపులు బిగించుకుని మంచాలమీద జాగరణ చేస్తున్నాయి. అక్కడ ఉన్న మనుషులకు, పోలీసులకు, కాపలా ఉన్న కుక్క కొత్తనరవాసనకి అరిచింది. ముఖాలమీదికి టార్చిలైట్లు వేసి తుపాకులు సర్దుకుంటున్నారు పోలీసులు. ప్రెశిడెంట్ కంబార్లు ఎవరెవరిని కేకవేసారు. ప్రెశిడెంట్ పెళ్లాం లేచికూర్చుంది. ప్రెశిడెంట్ తల్లి గట్టిగా కళ్లు మూసుకుంది. చుట్టూ ఉన్న ఇళ్లవాళ్లు తలుపులు దబదబ మూసేసుకుని లోపల్నించి చెవులురిక్కించి వింటూ కూర్చున్నారు.

నర్సిములు, సిమ్మాద్రి ఆ పరిస్థితికి తెల్లబోయారు. వాళ్లకు ముందు ఏమీ అర్థం కాలేదు. చుట్టుముట్టిన మనుషులంతా వాళ్లిద్దర్ని బూతులు తిట్టి పంపించారు. అనవసరంగా అన్ని తిట్లూ తిన్నందుకు ప్రాణం చచ్చిపోయింది. ఉస్సూరుమంటూ తిరిగి లారీవద్దకు వచ్చారు సిమ్మాద్రి నర్సిములు.

'రాత్రేళ పెశిరెంటూ ఆళ్ల ఆడోళ్లూ ఆళ్ల ఇళ్లల్లో తొంగోరు' అన్నాడు చంద్రన్న.

* * *

అంత రాత్రప్పుడు ఆ ఊళ్లో తినటానికి ఏం దొరకదు. ఆకలి — కడుపు మండిపోతున్నాది అని నర్సిములు గిలగిల తన్నుకుని గింజుకుంటున్నాడు. చూసి చూసి చంద్రన్న 'కసింత బెల్లం తెస్తాను. కొబ్బరికాయొకటి కొట్టికొని తిను' అని వెళ్లి బెల్లం తెచ్చిచ్చాడు.

నర్సిములు ఒక కొబ్బరిముక్కా ఇంతా బెల్లమూ సిమ్మాద్రికి ఇవ్వబోతే తీసుకో లేదు. 'నాకు ఆకలొకటి ఉందా? కంటికి నిద్ర ఉందా? ఏమొద్దు' అని చాలా నీరసంగా అన్నాడు. ఆ గొంతు దుఃఖంతో చివికిపోయినట్టు ఉంది. అప్పుడు సిమ్మాద్రి మీద భయాలన్నీ పోయాయి.

వాన వచ్చినప్పుడు, టీ తాగాలని నర్సిములు హోటల్‌లో దూరాడు. వాన తగ్గనీ అని ఆలస్యం చేశాడు. ఒక్క అరగంట ముందు వచ్చినా లోడింగ్ అయిపోయేది. అందరినీ పేరుపేరున తిట్టిన సిమ్మాద్రి తన వూసు ఎత్తకపోవటం తెలిసొచ్చి నర్సిములు మరింత నొచ్చుకున్నాడు. ఇంటి దగ్గర తిన్నాడో లేదో సిమ్మాద్రి. మధ్య నెక్కడా టీ అన్నా తాగలేదు. ఇప్పుడు తిండిలేదు. ఈ కొబ్బరన్నా తింటే —మళ్లీ వెళ్లి బతిమాలాడు నర్సిములు.

'నర్సిములూ నాకు ఆకలయితే నీవు బతిమాలాలా. నీ చేతిలోది తీసుకొని తిననా. నా గుండంతా కుమిలిపోతున్నాది. మందులు కొన్లేక డాక్టర్లకి ఫీజులు ఇచ్చుకోలేక పెళ్లాన్ని చంపేస్తున్నాను. అది చనిపోయేవేళకన్నా దాని ఎదుటవుండి ఆ కట్టెని బుగ్గి చెయ్యడానిక్కూడా నాకు' అని ఆగిపోయి మళ్లీ 'ఎప్పుడు తెల్లారుతుందో అని తూరపు దిక్కు చూస్తూ కూర్చున్నాను. నీవెళ్లి కునుకు తియ్యి. తెల్లారక ముందు బండి లోడ్ చేయించు. ఆ చంద్రన్నకి చెప్పు.'

ఆ మాటలు విని మారు నోరెత్తకుండా మండపం మెట్ల మీదికొచ్చి చంద్రన్న దగ్గర కూర్చున్నాడు నర్సిములు.

నర్సిములు బెల్లమూ కొబ్బరి తింటున్నాడు.

'పోలీసోళ్లు ఉన్నారుకదా... తుపాకులు పట్టుకొని... మల్లా ఈ జనాన్నంతా రమ్మనడం ఎందుకు? పోలీసోళ్లకీ కమ్యూనిష్టోళ్లకీ మద్దినపడి కాలి సచ్చిపోరూ నర్సింగులూ'

చంద్రన్న గొంతు బాగా తగ్గించి గాలితో మాత్రమే పలికి అడిగాడు.

నర్సిములు మాట్లాడలేదు.

'మనకీబూములన్నీ పంచుతారట నర్సింగులూ' అని, ఆ మాటకి నర్సిములు ఏం చెపుతాడో కూడా వినకుండా 'కమ్యూనిష్టోళ్లలో మనమూ కలిసిపోతే' చెవి దగ్గర నోరుపెట్టి అన్నాడు.

దక్షిణదిక్కు వీధినించి టార్చిలైట్ నడిచి వస్తున్న కాంతి కనిపించింది నర్సిములుకి. చంద్రన్నని వేలుతో పొడిచి అటుచూపించాడు. చంద్రన్న గుర్తు పట్టాడు. ఒకరు మేష్టరు. రెండోవాడు జగ్గన్న. మేష్టరు గన్‌లాగ సన్నగా పొడుగ్గా ఉన్నాడు. జగ్గన్న లోడ్ ఎక్కించుకున్న లారీలాగ బరువుగా ఎత్తుగా ఉన్నాడు.

టార్చిలైట్ వెలుతురు, ముందు లారీమీద — తర్వాత కొబ్బరికాయల రాశిమీద తర్వాత స్కూలు వరండాలోని పోలీసుల తుపాకుల మీదా — ఆ తర్వాత మండపం మెట్లమీద కూర్చున్న నర్సిములూ చంద్రన్నలమీదా — తిరుగుతూ పడింది. వాళ్లను చూడటంతోనే కూర్చున్నవాడల్లా లేచి నుంచున్నాడు చంద్రన్న.

'నర్సింలూ, డ్రయివరేడి?' దూరంనించే అడిగాడు మేష్టరు.

డ్రయివర్ అవసరం ఏదో వచ్చిపడినట్టుంది.

నర్సిములు కూడా నుంచుని 'ఎందుకు?' అన్నాడు.

జగ్గన్న ఖరీదయిన మనిషిలా కనబడ్డాడు. నుదుట సగం చెరిగిన నామం. నిమ్మకాయలు నిలబెట్టటానికన్నట్టు మీసాలు. కిల్లీ నమిలి నమిలి గారపట్టి నల్లబడ్డ పళ్లు. తాగినవాడి కళ్లలాగ ఎర్రబడ్డ కళ్లు.

'అవసరమొచ్చింది. ఎక్కడున్నాడేటి?'

'సీట్లో పడుకున్నాడు. ఈ డ్రయివర్ ధర్మన్న కాదు. ఈ రూట్‌కి కొత్త. ఈడు కోపిష్టి మనిషి —'

నర్సిములు చెప్పటం ఆపలేదు. సీట్లో అన్నమాట చెవిని పడటంతోనే లారీవేపు నడిచారు. మిగిలిన మాటలు వాళ్లు విన్నట్టు లేదు.

లారీ ఫుట్ బోర్డు మీద నుంచుని 'డ్రయివరూ డ్రయివరూ' అని మేష్టరు పిలుస్తున్నాడు. తలుపుమీద ఒక చేత్తో కొడుతూ వేరొక చేత్తో లోపల టార్చిలైటు

వేస్తున్నాడు జగ్గన్న.

సిమ్మాద్రికి... ప్రాణం కొంతసేపు ఈ మనసునీ గుండెనీ వొదిలి ఎక్కడికో పారిపోయి మళ్లీ వచ్చినట్టయింది.

'ఎవరు?' గొంతు కటువుగా.

'కొంచెం పనుందిలే'

కుక్కను కసిరినట్టు ఆ వచ్చిన పెద్దమనిషిని కసిరాడు సిమ్మాద్రి.

అవమానమయింది. 'తాగినట్టున్నాడు' అన్నాడు మేష్టరు జగ్గన్న చెవిలో.

మళ్లీ లేపుతున్నాడు మేష్టరు. అప్పుడే అక్కడికొచ్చిన చంద్రన్న 'డయివేరు బాబూ, వూరు పెశిరెంటు మావ... వొచ్చినాడు. తెలివి తెచ్చికుంతావా?' అన్నాడు.

చీదరించుకుంటూ లేచాడు సిమ్మాద్రి. 'ఏమయింది?' అన్నాడు. మళ్లీ కటువుగా

ఆ ధోరణి మేష్టరుకుగాని జగ్గన్నకుగాని నచ్చలేదు.

'ఒకసారి సోంపేటదాకా వెళ్లి రావాల. ప్రశిడెంట్ మరదలకి పెద్ద అపాయ మొచ్చింది' అన్నాడు గొంతు సర్దుకుని మేష్టరు.

'కుదరదు'

'కుదరక పోవడమేమిటి? ముందు దిగుతావా కిందికి?' రెచ్చిపోయి స్థాన బలం కొద్దీ మాట్లాడాడు మేష్టరు.

'కుదరదంటే కుదరదు' అని వాళ్లమాటల్ని తీసిపారేసి మళ్లీ శరీరాన్ని సీట్లో వాల్చాడు.

'వాడు ధర్మన్న కాదండి. కొత్తవాడు. కోపిష్టి మనిషి అంటే నామాట విన్లేదు మీరు' అన్నాడు నర్సిములు.

డ్రయివర్ పెడసరితనానికి జగ్గన్నకి కోపం మించిపోయింది. కాని పని జరగాలి కాబట్టి తమాయించుకుని తగ్గాడు. 'డ్రయివరూ నీ కష్టముంచుకోను. పది రూపాయిలిస్తాను. నీతో ఈ మేష్టరొస్తాడు. నా మాట దక్కించు. కాదనకు. ఎల్లి డాక్టర్ని మీయెంటే తీసికొని రండి.'

ఆ ఊళ్లోకల్లా భాగ్యవంతుడు జగ్గన్న. అంత దీనంగా బతిమాలుతుంటే కూడా సిమ్మాద్రి లెక్కచేయలేదు.

సిమ్మాద్రి చాలా సేపటినించి ఏడుస్తున్నాడు. వాడి కళ్లూ కనెప్పలూ ఇంకా తడిగా ఉన్నాయి. కన్నీళ్లతో ముక్కూ, చెవులూ, పెరిగిన గెడ్డమూ తడిశాయి. చెవికింద పెట్టుకున్న చేయి తడిసింది.

పెళ్లయి ఏడాదిన్నరకంటె ఎక్కువ కాలేదు. తొలి ఆర్నెలలు అదేమిటి... స్వర్గమే అనుభవించారు. చేతుల్తో చుట్టుకుని చూపుల్తో పిలిచే నీలమ్మ. తండ్రి చనిపోతే - తల్లి మారుమనువు చేసుకుని కూతుర్నొదిలేసి మొగునితో - కలకత్తా వెళ్లిపోతే - తాత దగ్గర పెరిగింది నీలమ్మ. క్లీనర్ నర్సిములు అంత వయసునించీ - అది గోచితో తిరుగుతున్నప్పటి నించీ - దాని ఏడెనిమిదేళ్ల వయసు నించీ చూసి - పరాచకాలాడి, దెబ్బలు తిని, తిట్లు తిని, అవమానపడి, చేసుకున్న పెళ్లి. వయసొచ్చి నీలమ్మ సొగసులని తీర్చింది. అది సొగసు కాదు - నీలమ్మ. ఆ జ్ఞాపకాలతో ఉక్కిరి బిక్కిరిగా ఏడుస్తున్నాడు. ఆ ఏడుపుకూడా ఏడుచుకోనివ్వకుండా వచ్చి వీళ్లు ఇబ్బంది పెడుతున్నారు. ఏడుపు గొంతునీ కన్నీళ్ల ముఖాన్నీ దాచుకుంటూ కసురుతున్నాడు సిమ్మాద్రి.

సిమ్మాద్రికి తను చెప్పినా మాట దక్కదని అంటీఅంటినట్టు నుంచున్నాడు నర్సిములు. డ్యూటీలో ఉన్న పోలీసులు గొడవంతా చూస్తున్నారు.

'ఇదిగో డ్రయివరూ నా చిన్న కూతురుకు ప్రాణాపాయమొచ్చింది. డాక్టర్ని తెచ్చావో నీకు పుణ్యముంటుంది. జన్మజన్మలకి రుణపడి ఉంటాన్నీకు. పాతిక రూపాయిలిస్తాను. నీ కష్ట ముంచుకోను. ఒక మనిషి ప్రాణం కాపాడు. నీకు పుణ్యముంటుంది. నా మాట కాదనకు?'

అడుక్కుంటున్న వాడిలాగ జగ్గన్న డ్రయివర్ని బతిమాలుతుంటే చంద్రన్న గుండె కరిగిపోయింది.

'పాతిక్కాదు, పాతిక వేలిచ్చినా కుదరదు' అని ఖండితంగా చెప్పాడు సిమ్మాద్రి.

నక్సలైట్లు వచ్చే వేళవుతున్నదని ఒక వేపు గుండె పీకుతున్నది జగ్గన్నకి. మరొక వైపు కూతురు ప్రాణం పోతుందేమోనని బాధగా ఉంది. ఆ భయాల మధ్య బాధలమధ్య నలిగిపోతున్నాడు. తొందరగా డ్రయివర్ని ఒప్పించాలి. డాక్టర్ దగ్గరకు వెళ్లటానికి ఆ లారీ తప్ప ఇంకో మార్గం ఏదీ లేదు. మళ్లీ బతిమాలుతున్నాడు.

'ముఖంమీద టార్చ్‌లైట్ కొట్టారెందుకు, ముందది తీయండి'

మళ్లీ కసిరాడు సిమ్మాద్రి.

నా పెళ్లాం చస్తున్నాది మొర్రో అంటే బండి లోడ్ చేయించుకోనిచ్చార్రా, నన్ను వెళ్ల నిచ్చార్రా. మీకు కష్టాలున్నాయి. మీకు కూతుళ్లమీద ప్రేమున్నాది. మీకు డబ్బున్నాది. ఆ డబ్బుతో మీ కూతుళ్లకు డాక్టర్లని కొనగలుగుతారు. నా పెళ్లాన్ని బతికించుకోగల ఆశలేదు నాకు. చివరికి చచ్చిపోయేముందు దాని కళ్లచూపు చూడటానిక్కూడా భాగ్యం

లేకపోయింది. నీ కూతురు చావనీరా. నీవూ చావు. ఏడిచి ఏడిచి కుళ్లి చావు. నేను చావటం లేదూ? కుళ్లి కుళ్లి నా గుండెలు కోత పెట్టటం లేదూ? నా పెళ్లం నాకు వద్దా? నా పెళ్లం నన్ను ప్రేమించలేదా, ఎవరి ప్రేమ వాళ్లదే... ఎవరి కష్టాలు వాళ్లవే. లంజ కొడకా ఇక్కడుండొద్దు పో. అని లోపల్లోపల కసికొద్దీ పళ్లుకొరికి తిడుతున్నాడు సిమ్మాద్రి.

'పెద్దమనిసొచ్చి మాటాడుతున్నాడు. ముందు కిందికిదిగి మాటాడు డ్రయివరూ'

లుంగీ కట్టుకుని బనీనుతో వచ్చాడు మేష్టరు. రెయిన్‌షూ ఉంది కాళ్లకి. చేతికి గడియారం. మాటలతో సాధ్యమయినంతవరకు పని సాధించాలను కుంటున్నాడు.

'డ్రయివరూ, జగ్గన్నగారంటే ఎవరో నీకు తెలిసినట్టులేదు. కొత్తగా వచ్చావు కదా. మీ ప్రొప్రయిటర్‌గారూ జగ్గన్నగారూ నేస్తాలు. ఆయన ఇటొస్తే జగ్గన్న గారింట్లోనే ఉంటారు. జగ్గన్నగారు శ్రీకాకుళం వెళితే మీ ప్రొప్రయిటర్ ఇంట్లోనే ఉంటారు. మీ ప్రొప్రయిటర్ మర్యాదన్నా కాపాడు. చివరిమాట చెప్తున్నాను. ముందు కిందికి దిగు. మనిషిని చూసి మాటాడు. ఎవడో దిక్కులేని వెధవ నీ దగ్గరికి రాలేదు. కొంచెం ఆలోచించి మంచీ చెడ్డా చిన్నా పెద్దా చూడు.' అన్నాడు మేష్టరు.

సిమ్మాద్రి నోరు విప్పలేదు.

మళ్లీ మేష్టరు 'జగ్గన్నగారు ఉపకారం చేసే మనిషి. ధర్మన్ననే అడుగు నీకు తెలుస్తుంది.' జగ్గన్న మంచితనాన్ని కొనియాడాడు.

'అందరూ ఉపకారం మనుషులే. ఆసుపత్రిలో డాక్టరు కాళ్లా వేళ్లా పడి బతిమాల్తే 'ఇంక లాభంలేదు. మందులేవీ పన్చేయవు. ఒకటి రెండు దినాల మనిషి. నేను దేవుణ్ణి కాను. రోగం ముదిరిపోయింది. ఏం చేయలేము. చేయి జారిపోయింది. తీసుకుని వెళ్లిపో' అని ఆగకుండా వెళ్లిపోయాడు. బెడ్‌మీది రోగిని డిస్చార్జి చేసి బలవంతాన పంపించేశాడు. నా మొర ఎవరు విన్నారు. ఎవరు నా కష్టాలు చూశారు. అంతా ఉపకారం మనుషులే.' కోపంతో మండిపోతున్నాడు సిమాద్రి.

జగ్గన్నకి తొందరగా ఉంది. నక్సలైట్ల నోటీసు వచ్చిన మొదట్లో లెక్కచెయ్యలేదు. కాని వరసగా జిల్లాలో ఆరేడుగురు భూస్వాములని వాళ్లు చంపేశారు. తలలు చెట్లకు వేలాడ గట్టారు. నెత్తురు బకెట్లలో పట్టి చేతి ముద్రలు గోడలమీద వేసి నినాదాలు రాసారు. ఆ ఊరుకు ఐదారుమైళ్లలో ఇద్దరు భూస్వాములను చంపేసారు. జగ్గన్న ఇప్పుడు రాత్రిపూట ఊళ్లో నిద్రపోవటం లేదు. తోటల్లో ఆవులమందల మధ్యనో, గొర్రెల మందల మధ్యనో, రోజుకొకచోట జాగరణ చేస్తున్నాడు.

సామాన్యంగా పన్నెండు గంటల సమయంలో ఊరు చుట్టుముట్టేస్తారు నక్సలైట్‌లు. ఒకరా ఇద్దరా వంద రెండువందల మంది దాకా ఉంటున్నారు. బాంబులు విసురుతారు. మైకుల్లో ఇల్లు కదలొద్దని హెచ్చరిక చేస్తారు. ఈ పోలీసుల్ని చూస్తుంటే నక్సలైట్లతో వీళ్లు కుమ్మక్కయినట్టుంది. ఇన్ని వేలమంది పోలీసులు వచ్చి తాలూకాల్లో ఉన్నా హత్యలు చేసి పారిపోతున్నారు నక్సలైట్లు.

'డ్రయివరూ, నీవే నాకూతురుకు ఇప్పుడు ప్రాణం పోయగలవు. ఇంక నాకు ఏ ఆశా కనబడడంలేదు. ఒక ప్రాణాన్ని కాపాడమని బతిమాలుతున్నాను. డాక్టర్‌ని వెళ్లి తీసుకురండి. నేను ఏం ఉపకారం చేస్తానో నీకే తెలుస్తుంది. నామాట నమ్ము' అని చివరిసారిగా జగ్గన్న ప్రాధేయపడి కోరాడు.

డాక్టర్లంటేనే అసహ్యం సిమ్మాద్రికి. ఐదోనెల గర్భం పోయింది నీలమ్మకి. ముందు గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకు వెళ్లాడు. తగ్గినట్టు కనిపించలేదు. తర్వాత ప్రవేట్ డాక్టర్ల దగ్గరికి తీసుకు వెళ్లాడు. తగ్గలేదు. చెప్పిన మందులన్నీ కొన్నాడు. డాక్టర్లకు ఏం తక్కువ చేస్తే ఎక్కడ అశ్రద్ధ చూపుతారోనని అడిగినంత ఫీజు చెల్లించుకున్నాడు. పెద్దాసుపత్రికి విశాఖపట్నం తీసుకు వెళ్లాడు. డబ్బు ఖర్చయిందే కాని రోగం నయం కాలేదు. నీలమ్మ ఎముకల గూడయిపోయింది. లాభంలేదని డిస్చార్జి చేసి పంపించేశాడు డాక్టరు. రోజూ చచ్చిపోతుందని - పదిహేను దినాలు గడిచాయి. డబ్బుకు లోభ పడకుండా ముందే మంచి డాక్టర్‌కు చూపించి ఉంటే నీలమ్మ బతికేది. డబ్బుకి కక్కుర్తి పడి నీలమ్మని చంపేసి - రేపు వెళ్లేసరికి నీలమ్మ బతికుంటుందా.?

'డాక్టర్ను తీసుకొచ్చి నా కూతురు ప్రాణం కాపాడు డ్రయివరూ' అంటున్నాడు జగ్గన్న.

'బాబూ నన్నొదలండి. చంపకండి. నా దుఃఖంలో నేను మునిగున్నాను. మీకు వెయ్యిదండాలు పెట్తాను వెళ్లండి. ఆ మేనేజర్ లంజ కొడుకు చేశాడు ఇదంతా' అని మళ్లీ గొంతు కఠినం చేశాడు సిమ్మాద్రి.

* * *

గోడౌన్ల దగ్గర బండిని ఆపి కిందికి దిగాడు సిమ్మాద్రి. చెప్పులమేకులు పాదాలకు గుచ్చుకుంటున్నాయి. నొప్పిగా ఉంది.

కళాసీలు వచ్చారు బండి దగ్గరికి. నర్సిములు అక్కడే ఉన్నాడు.

తిన్నగా సిమ్మాద్రి ఆఫీసువేపు నడిచాడు.

ఉదయం ఆ ఊళ్లో మేష్టరు, జగ్గన్న, ప్రశిడెంటు ఇంకా కొందరు పెద్ద మనుషులు

డ్రైవర్‌ని పిలిపించారు. జగ్గన్న కూతురు రాత్రి చనిపోయింది. డ్రైవర్‌ని తిట్టారు. తన్నబోయారు. మేష్టరు డ్రైవర్ ముఖాన ఉమ్మాడు. ఎముకలు విరగ్గొట్టే వాళ్లే, నర్సిములు అడ్డుపడి నీలమ్మ చావుబతుకుల మీదున్న సంగతి చెప్పకపోతే - కుళ్లబొడిచేవాళ్లు. నర్సిములు చెప్పిన మాటకూడా ఆ పెద్దలు నమ్మలేదు. మేష్టరు ఎత్తు ఎత్తినాడన్నాడు. వాడితో రాత్రి నర్సిములు చెప్పిన సంగతి వినికూడా అలా మాటాడాడు. అనరాని మాటలన్నారు. తల తీసేసినట్టయింది. 'డ్రయివరూ ఆ పిల్ల ప్రాణం నీ మూలంగానే పోయింది. నీవే తినేసావు బంగారంలాంటి పిల్లని. ఆ పాపం నీకు చుట్టుకోకుండా ఉండదు. అందుకే నీ బతుకు ఇలా ఉంది' అన్నాడు. ఆ మాటలు సిమ్మాద్రి చెవుల్లో మళ్లీ మళ్లీ గింగురుమంటున్నాయి. ఆ పిల్ల చచ్చిపోవటానికి అక్కడ ఇరుగూ పొరుగూ తల్లీ తండ్రీ ఎవరూ కాదు కారణం. అనుకోకుండా డూటీమీద వెళ్లి ఆ రాత్రి అక్కడ చిక్కిపోయిన తను కారణమట.

నీలమ్మ...

ఆఫీసులో మేనేజరూ, గుమస్తా, టైపిస్టూ ముగ్గురే... ఎవరి పనుల్లో వాళ్లు తీరిక లేకుండా ఉన్నారు. మేనేజర్ దగ్గరకు వెళ్లి నుంచున్నాడు సిమ్మాద్రి పైసలు కోసం.

'ఇప్పుడే అరగంట కిందట రామ్మూర్తి వొచ్చి కూర్చున్నాడు. ఇచ్చి పంపించినాను. ఇక్కడ సంతకం చెయ్.' అని రెవెన్యూ స్టాంప్ అతికించిన రిజిష్టరు తన దిక్కు పెట్టాడు.

సిమ్మాద్రి నెలజీతం మెడికల్‌షాప్ ప్రొప్రయిటర్ రామ్మూర్తి వచ్చి నెలనెలా అప్పుకింద తీసుకుపోతాడు. ఇంకా అయిదు వందలకు పైగా అప్పు చెల్లించాలని లెక్క చూపుతున్నాడు. ఆ షాప్‌లో రేట్లు రెట్టింపు ఉంటాయని తెలిసికూడా క్రెడిట్ ఇచ్చే వాళ్లులేక మేనేజర్‌ని బతిమాలుకుంటే, పూచీపడి ఇప్పించాడు.

మేనేజర్ బత్తా ఇస్తాడని చూస్తున్నాడు సిమ్మాద్రి.

టైపిస్టు టపటప కొడుతున్నాడు. గుమస్తా వందరూపాయల నోట్లు లెక్క పెట్టి కట్టలు కట్తున్నాడు. పైన సీలింగ్‌ఫేన్ తిరుగుతున్నది. స్టేట్‌బేంకు వాళ్ల కలర్‌ఫోటోల కేలండరు ఆగస్టు నెలతో గోడకి వేలాడుతున్నది. చందమామ లాంటి గోడ గడియారం పదకొండు గంటలు చూపుతున్నది. ఆల్సేషియన్ కుక్క ఆఫీసు నించి బయటికీ, బయిటినించి ఆఫీసుకీ వచ్చేపోయే మనుషుల వాసన పసికగడుతున్నది. తిరుపతి వెంకటేశ్వరుల పటానికి కొత్త పూలహారం వేలాడుతున్నది. కిటికిలోంచి గోడౌన్ల దగ్గర ముదురాకుపచ్చరంగు లారీ కనిపితున్నది. కళాసీలు కొబ్బరికాయలు అన్‌లోడ్ చేస్తున్నారు.

ఐదు రూపాయినోట్లు కొన్ని తీసి సిమ్మాద్రి చేతిలో పెట్టాడు మేనేజరు. బత్తా తీసుకుని బయటపడ్డాడు సిమ్మాద్రి.

సుబ్బన్న... హనుమంతయ్య... సాంబడు... గోపాల్రావు... రెడ్డి... వీళ్లంతా కలుస్తారు. కాని అప్పు తీర్చమని అడగరు. అడగక పోయినా వాళ్లని చూస్తుంటేనే భయమేస్తుంది. వాళ్లకు సిమ్మాద్రి కష్టాల్లో ఉన్నాడని తెలుసు. అందుచేత అడగరు. ఇచ్చేస్తానని చెప్పికూడా సిమ్మాద్రి అప్పు చెల్లించలేక పోతున్నాడు.

మధ్యన కిరాణాషాపు వస్తుంది. ఆ షావుకారును తప్పించుకోవాలి. అంచేత మరో వీధిలోంచి పోవాలి.

వర్షానికి రోడ్డంతా బురదగా ఉంది. రోడ్డుమీద బస్సులు లారీలు కార్లు రిక్షాలు సైకిళ్లు నల్లటి తలకాయలు, రంగు రంగుల గుడ్డల మనుషులు, మురికిమీద చేరిన ఈగల్లాగ జుమ్మంటూ కనిపిస్తున్నారు.

తిన్నగా ఇంటికి వెళ్లాడు. ఆ ఇంటి ముందు చాలా ఏళ్ల క్రితం ఓ మట్టి ఇల్లు కూలిపోయి పుట్టలు పుట్టలుగా పడుంది. ఆ స్థలమంతా జిల్లేడు, తంగేడు, ఉమ్మెత్త, గడ్డి, పిచ్చి పిచ్చి పాదులు దట్టంగా పెరిగాయి. వాటి మధ్యనించి సన్నటి దారి. ఆ ఇల్లు బాగా లోపలికి ఉంది. ఆ ఇంటికి ఒక పక్క డాక్టరుగారి కొత్త డాబా – రెండోపక్క లాడ్జింగ్ ప్రొప్రయిటర్‌గారి మేడ. ఆ పక్కన సాంఘిక సంక్షేమ కార్యాలయం. మిగిలిన ఇళ్లన్నీ రోడ్డుకు ఆనుకునే ఉన్నాయి. ఆ ఇళ్లకి ఎదురు వాడలో అడ్వొకేట్‌గారి ఆఫీసు. బ్రాంచి పోస్టాఫీసు, ప్రింటింగ్ ప్రెస్సు, ఫోటో స్టూడియో వరసగా ఉన్నాయి.

సిమ్మాద్రి ఇంటిలోపల అడుగు పెట్టేసరికి ఒక ముసలి తల్లి కుక్క ఓ పక్క పడుకుని ఉంది. నీలమ్మ చచ్చిపోయి ఉందో ఇంకా నాడి ఆడుతున్నదో ముందు తెలీలేదు. ఆ పక్కంతా తడితడిగా ఉంది. పక్క గుడ్డలన్నీ ఎటువటు చెదిరిపడి ఉన్నాయి. అక్కడ ఈగలు ముసురుతున్నాయి.

నీలమ్మ దగ్గర కూర్చున్నాడు. కళ్లల్లోకి చూశాడు. ఆ కళ్లకి ఇంకా చూపు అంటుకుని ఉంది. కళ్లల్లో తడి ఉంది. చేయి చూశాడు. ఆ చేతికి కదలిక ఉంది. పెదాలు చూశాడు. అవి కదులుతున్నట్టు కనిపించాయి.

ఇంట్లో ఈ జబ్బు మనిషికి తోడుండమని ఉంచిన ఆమె కనిపించలేదు.

నీలమ్మా అని రెండు చేతులతోను ఆమె ముఖాన్ని పట్టుకున్నాడు. ఆమె ముఖం మీద కన్నీళ్లు కురిశాయి.

చల్లగా నీలమ్మ.

జగ్గన్న కూతురు గుర్తు వచ్చింది. తన మూలంగా ఆ పిల్ల చచ్చిపోతే —తనే ఆ పిల్లను చంపేస్తే — ఆ పిల్లని తనే తినేస్తే—తన పెళ్లాన్ని... నీలమ్మని... ఎవరు ఎవరు తినేసినట్టు? ఎవర్ని నిందించాలి? ఎవర్ని ఎందర్ని... తిట్టాలి?

ఆ ఇంటికి చుట్టూ డాక్టరుగారి డాబా. లాడ్జింగ్ హౌస్ ప్రొప్రయిటర్‌గారి మేడ. ఆ పక్కన సాంఘికసంక్షేమ కార్యాలయం. ఎదరువాసలో బ్రాంచి పోస్టాఫీసు. ప్రింటింగ్ ప్రెస్సు. అడ్వకేట్‌గారి ఆఫీసు. ఫోటోస్టూడియో. వాటి మధ్యనున్న సిమ్మాద్రి ఇంట్లోంచి లేచిన పెద్ద ఏడుపు ఎవరికీ వినిపించలేదు.

ఆ ఏడుపుకు తట్టుకోలేక అంతసేపు కాపలా ఉన్న కుక్క మాత్రం అక్కడనుండి లేచి బయటికి పోయింది.

* * *

*ఆంధ్ర సచిత్ర వారపత్రిక*

*6.12.69*